సాక్షి నిజామాబాద్

బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



ఆయకట్టును కాపాడాలి

ఎస్సారెస్పీ నుంచి ఎంఎండీ వరకు గల ఆయకట్టును కాపాడాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸



కాంగ్రెస్‌కు ఆదరణ కరువు

దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఆదరణ కరువైందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.2 /20.5

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

టర్కిష్ కప్ టోర్నీకి గుగ్లోత్ సౌమ్య



నిజామాబాద్‌నాగారం: టర్కిష్ కప్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో ఆడే భారతజట్టుకు జిల్లాకు చెందిన గుగ్లోత్ సౌమ్య ఎంపికైంది. 23 మందితో కూడిన జట్టులో ఆమెకు చోటు దక్కింది. బుధవారం నుంచి జరుగనున్న టోర్నీలో పాల్గొననుంది. ఈ నెల 24న హాంకాంగ్, 27న కొసోవో జట్టుతో భారత జట్టు తలపడనుంది. సౌమ్య ఎంపికవడంతో జిల్లాలోని ఫుట్‌బాల్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండ్లలో ఖాళీ షాపుల వేలానికి టెండర్ల ఆహ్వానం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్లలో గల ఖాళీ షాపులు, స్థలాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆర్‌ఎం జానీరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని బస్టాండ్లలో 62 షాపులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. బుధవారం నుంచి ఈ నెల 29 వరకు టెండర్లు వేయవచ్చన్నారు. టెండర్ ఫారాలు డిపో మేనేజర్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫారాలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. మార్చి 1న ఉదయం 10:30 గంటలకు టెండర్లను ఓపెన్ చేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు డిపో మేనేజర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

సైబర్ కేసులు వస్తే వెంటనే స్పందించాలి



ఖలీల్‌వాడి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే సైబర్ కేసులపై సంబంధిత పోలీసులు వెంటనే స్పందించాలని సీపీ కల్మేశ్వర్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కమిషరేట్‌లో గల కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకొని ఎఫ్ఐఆర్‌లో నిక్షిప్తం చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సోషల్ మీడియాలో అవగాహన కల్పించాలన్నారు. సైబర్ క్రైం ద్వారా ఆర్థికంగా నష్టపోయిన బాధితులు ముందుగా నేషనల్ క్రైం విభాగం హెల్ప్ లైన్ నంబర్ 1930కి సమాచారం అందించడంతో బాధితులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. సైబర్ నేరగాళ్లు డబ్బును మళ్లించకుండా ఖాతాలకు సంబంధించిన లావాదేవీలను పూర్తిగా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని సైబర్ వారియర్స్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఏసీపీ వేణుగోపాల్ రెడ్డి, సీఐ ముఖీద్ పాషా, ఎస్సై పూర్ణేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: విదేశాల్లో ఉన్నత విద్య నభ్యసించే మైనారిటీ విద్యార్థులు(ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బుద్దిస్టులు, పార్శీలు) సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం) కింద దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ లో 60శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసేందుకు, పీజీలో 60శాతం మార్కులు ఉండి పీహెచ్‌డీ చేయాలనుకునే వారు మాత్రమే అర్హులన్నారు. పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే విద్యార్థులు ఫాల్ సీజన్ 2023(ఆగస్టు 2023 నుంచి డిసెంబర్ 2023) వరకు ఎంపిక చేయబడిన విదేశీ వర్సిటీల్లో అడ్మిషన్ పొంది ఉండాలన్నారు. అర్హులైన విద్యార్థులు అన్ని ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో ఈనెల 20 నుంచి వచ్చేనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ కార్గో ద్వారా మేడారం ప్రసాదం

ఖలీల్‌వాడి: మేడారం సమ్మక్క–సారలమ్మ (ప్రసాదం) బంగారం కోసం భక్తులు ఆర్టీసీ కార్గో ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని రీజియన్ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉమ్మడి జిల్లాలోని భక్తులు పేటీయం ద్వారా రూ.299 చెల్లిస్తే ప్రసాదాన్ని భక్తుల ఇంటికి తీసుకొచ్చి అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఆర్మూర్–95502 32626, బోధన్–90142 96638, నిజామాబాద్–1 91542 98727, నిజామాబాద్–2 73968 89496, కామారెడ్డి–91542 98730 నంబర్లను సంప్రదించాలన్నారు.






సీట్ల కోసం పాట్లు

నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోతోంది. మేడారం జాతరకు రీజియన్ నుంచి దాదాపు 270 బస్సులను అధికారులు వరంగల్‌కు పంపించారు. ఈ కారణంగా బస్సుల కొరత ఏర్పడడంతో ప్రయాణికులు పడికాపులు కాస్తున్నారు. బస్సు రాగానే ఒకేసారి గుమిగూడి ఎక్కేందుకు ఎగబడుతున్నారు. సీట్ల కోసం కొందరు కిటికీల్లో నుంచి బస్సుల్లోకి ఎక్కుతున్నారు. గత్యంతరం లేక కొందరు ప్రయాణికులు ఫుట్‌పాత్‌లపై నిలబడిపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. – సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అవినీతి అనకొండ..!

- గుట్టలుగా వెలుగుచూస్తున్న మాజీ డీసీవో సింహాచలం అక్రమాలు
- బదిలీ అయినా రికార్డులు అప్పగించని వైనం
- శ్రీకాకుళం నుంచి నిపుణులను తీసుకొచ్చి ట్యాంపరింగ్
- కమిషనరేట్‌కు ఫిర్యాదు చేసిన కొత్త డీసీవో శ్రీనివాస్
- సింహాచలంపై చర్యలకు డీసీసీబీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం!
- 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన కథనంతో కదలిక



ఆటోలో ఓటరు చైతన్య కార్యక్రమం చేసినట్లు చూపగా.. సదరు నంబరుపై ఉన్న బైక్ ఇదే..



ఆటో స్థానంలో రాసిన టిప్పర్ లారీ నంబర్ ఇదే..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: డీసీవో అంటే డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్.. అయితే దీన్ని డిస్ట్రిక్ట్ కరప్షన్ ఆఫీసర్ అనేవిధంగా అర్థం మార్చేశాడు అవినీతి అనకొండ సింహాచలం అంటూ పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఎనిమిదేళ్లుగా జిల్లా సహకార అధికారిగా పనిచేసిన సింహాచలం అవినీతి అనకొండకు మారుపేరుగా వ్యవహరించాడు. ప్రభుత్వానికి సమాంతరంగా వ్యవహరించి మాఫియాలాగా అండర్‌గ్రౌండ్ సామ్రాజ్యాన్ని నడిపించాడు. ఇతని వ్యవహారం ఎక్కడిదాకా వెళ్లిందంటే జిల్లాలోని ఎమ్మెల్యేలను సైతం లెక్కచేయనంత స్థాయికి చేరింది. దీంతో ఇతని అక్రమాలను, అవినీతిని, అక్రమ వసూళ్లను భరించారే తప్ప సొసైటీ చైర్మన్లలో ఏ ఒక్కరూ కూడా సహకార శాఖ సమాచారం గానీ, సింహాచలం వసూళ్ల పర్వం గురించి కానీ బయటకు చెప్పలేని పరిస్థితిని కల్పించాడు. ఇప్పుడు ఇతను బదిలీ అయినప్పటికీ సమాచారం ఇచ్చేవారు ఒకరిద్దరే అంటే ఆశ్చర్యం లేదు. సింహాచలం జిల్లాలో ఏ సహకార సంఘం ఉన్న ఊరికి వెళ్లినా ఊరిబయట కారు ఆపుకుని కూర్చుంటే అక్కడకు ముడుపులు పంపాల్సిన పరిస్థితి సహకార సంఘాల బాధ్యులది. ప్రభుత్వం మారడంతో ఇంటెలిజెన్స్ నుంచి సీఎం రేవంత్‌కు సింహాచలం గురించిన వివరాలు వెళ్లాయి. దీంతో ఇతన్ని ఆదిలాబాద్ డీసీసీబీ ఓఎస్‌డీగా బదిలీ చేశారు.

రికార్డుల ట్యాంపరింగ్

జిల్లాకు వచ్చిన డీసీవో శ్రీనివాస్‌కు రికార్డులు అప్పగించకుండా తన ఇంటి వద్దనే పెట్టుకున్న సింహాచలం.. తన సొంత జిల్లా శ్రీకాకుళం నుంచి 10 మంది నిపుణులను తీసుకొచ్చి రికార్డులను ట్యాంపరింగ్(దొంగ లెక్కలతో కొత్త రికార్డులు తయారు చేయడం)చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇతన్ని బదిలీ చేసి మొదట పోస్టింగ్ ఇవ్వలేదు. తర్వాత ఆదిలాబాద్ డీసీసీబీలో ఓఎస్‌డీగా ఇచ్చింది. అయినా నిజామాబాద్‌లోనే ఉండి రికార్డులు తయారు చేస్తుండడం గమనార్హం. సింహాచలం అవినీతిపై ఇటీవల 'సాక్షి'లో 'అక్రమాల పుట్ట' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అక్రమాలపై పూర్తి విచారణ చేసి తగినచర్యలు తీసుకోవాలని కోరుతూ నిజామాబాద్ డీసీసీబీ సర్వ సభ్య సమావేశంలో సోమవారం తీర్మానం చేసినట్లు సమాచారం.

పర్యాటక శాఖ, గృహలక్ష్మి పథకం ఇన్‌చార్జిగా..

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి నమ్మిన బంటుగా వ్యవహరించిన సింహాచలం తనకెలాంటి సంబంధం లేని పర్యాటకశాఖ అధికారిగానూ వ్యవహరించి ఆ శాఖనూ భ్రష్టు పట్టించినట్లు తెలుస్తోంది. మరోవైపు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి సైతం జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరించిన సింహాచలం అందులోనూ అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. ఇలా చెప్పుకుంటూ పోతే సింహాచలం గురించి కొన్ని పుస్తకాలే రాయొచ్చని పలువురు చెబుతున్నారు.

2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటరు చైతన్య కార్యక్రమం జిల్లా ఇన్‌చార్జిగా సింహాచలమే వ్యవహరించాడు. ఇందుకు సంబంధించి సహకార సంఘాల్లో అవగాహన కార్యక్రమాల పేరిట భారీగా ఖర్చులు రాశాడు. ఒక్క ఆటోకు రోజుకు రూ.4 వేల చొప్పున రాశాడు. కాగా తీరా వెలుగులోకి వచ్చిన అంశాలు ఏమిటంటే ఆటోల నంబర్ల స్థానంలో ద్విచక్ర వాహనాలు, టిప్పర్ లారీలు, హోండా సిటీ కార్లు ఉండడం విశేషం. ఇక జిరాక్స్ పేపర్లు, ఛాయ్‌ల పేరిట ఒక లెక్క అనేది లేకుండా రోజుకు రూ.20 వేలకు పైగా బిల్లులు రాయడం గమనార్హం. వివిధ మండలాల్లో ఓటర్ల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఫ్లెక్సీలు పెట్టినట్లు బిల్లులు పెట్టగా.. అలాంటి ఫ్లెక్సీలు ఏమీ లేవని తహసీల్దార్లు చెప్పడంతో అప్పటి కలెక్టర్ బిల్లులు మంజూరు చేయలేదు. అయితే కలెక్టర్ మారిన తరువాత మాత్రం తప్పుదోవ పట్టించిన సింహాచలం సదరు బిల్లులను మంజూరు చేయించుకోవడం విశేషం. సింహాచలం అవినీతి చిట్టాను చూస్తుంటే అనేక అక్రమ వ్యవహారాలు బయటకు వస్తున్నాయి. ఇవి చాంతాడంత ఉండడం గమనార్హం.

బదిలీ అయినా..

సింహాచలం బరితెగింపు ఎలా ఉందంటే గత నెల 16న కొత్త ప్రభుత్వం ఇతన్ని బదిలీ చేసింది. ఇతని స్థానంలో శ్రీనివాస్ డీసీవోగా గత నెల 19న బాధ్యతలు స్వీకరించారు. నెల రోజులు దాటినప్పటికీ సింహాచలం శాఖకు సంబంధించిన రికార్డులు అప్పగించకుండా తనవద్దే పెట్టుకున్నాడు. దీంతో కొత్త డీసీవో శ్రీనివాస్ రికార్డుల కోసం కమిషనరేట్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనరేట్ నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ సింహాచలం రికార్డులు ఇవ్వలేదు. దీంతో విచారణ కోసం 'కమిషనర్ అండ్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీ' నుంచి జాయింట్ రిజిస్ట్రార్ ప్రసన్నను నియమించారు. ఆమె విచారణ చేపడుతున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు సింహాచలం రికార్డులను అప్పగించకపోవడంతో తాజాగా మంగళవారం డీసీవో శ్రీనివాస్ కమిషనరేట్‌కు మరోసారి ఫిర్యాదు చేశారు.

పూర్తిస్థాయిలో రుణాల పంపిణీ జరగాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ప్రత్యేకించి జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతమైనందున పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. గత వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ ఏడాది వ్యవసాయ రంగానికి రూ. 4,062.20 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం కాగా, గత డిసెంబర్ నాటికి రూ. 2,578.40 కోట్లను పంపిణీ చేసి 63.48 శాతం లక్ష్యాన్ని సాధించామని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్‌రావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇందులో వానాకాలం సీజన్‌కు సంబంధించి రూ. 2,437 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం కాగా, రూ.1801 కోట్ల రుణాలు అందజేసి 73 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత యాసంగి సీజన్‌లో రూ. 1,625 కోట్ల పంట రుణాలు అందించాల్సి ఉందని, డిసెంబర్ 31 నాటికి రూ. 776 కోట్లు పంపిణీ చేశామని, మార్చి నెలాఖరు నాటికి లక్ష్య సాధన పూర్తిచేసేలా కృషి చేస్తున్నామన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నూరు శాతం లక్ష్య సాధనపై దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో ఆర్‌బీఐ డీజీఎం అనిల్ కుమార్, నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, మెప్మా పీడీ రాజేందర్, జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

అట్టహాసంగా కేవీ భవన ప్రారంభోత్సవం



కేంద్రీయ విద్యాలయ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. ప్రధాని మోదీ జమ్మూలోని ఐఐఎం నుంచి వర్చువల్‌గా భవనానికి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమానికి ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలను ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశమంతటా విస్తరిస్తోందన్నారు. నిజామాబాద్‌లో 7.5 ఎకరాల విస్తీర్ణంలో రూ. 22 కోట్లు వెచ్చిస్తూ అన్ని వసతులతో కేంద్రీయ విద్యాలయ నూతన భవనాన్ని నిర్మించామని పేర్కొన్నారు. టెన్త్ వరకు కొనసాగుతున్న ఈ విద్యాలయంలో త్వరలోనే 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బోధన్‌లోని కేంద్రీయ విద్యాలయ భవనాన్ని వచ్చే ఏడాది అందుబాటులోకి తెస్తామన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయానికి అన్ని వసతులతో కూడిన నూతన భవ నం అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ విద్యాలయాల్లో నాణ్యమైన విద్య అందుతోందన్నారు.

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల్లోని విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని బోధకులకు సూచించారు. విద్యాలయం ఆవరణలో చదువుల తల్లి సరస్వతీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు అవసరమైన నిధులను తాను సొంతంగా సమకూరుస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ సంస్థల హైదరాబాద్ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ మమత, కేంద్రీయ విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కేవైసీ తిప్పలు..

- 'పీఎం కిసాన్'కు 5,800 మంది రైతులు దూరం
- కేవైసీ కాకపోవడమే కారణం
- ఈ నెల 25లోగా పూర్తి చేయాలని గడువు



దొంకేశ్వర్‌లో రైతులను పిలిపించి కేవైసీ చేస్తున్న వ్యవసాయాధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): పీఎం కిసాన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పంట పెట్టుబడి సాయానికి జిల్లాలో 5,800 మంది రైతులు దూరంగా ఉన్నారు. కేవైసీ పూర్తి చేసుకోనందుకు వీరికి గతేడాదిలో 15వ విడత డబ్బులు అందలేదు. దీంతో ప్రస్తుత ఏడాది 16వ విడత పెట్టుబడి సాయాన్ని మిగిలిపోయిన రైతులకు అందించడానికి వ్యవసాయాధికారులు నానా తంటాలు పడుతున్నారు. కేవైసీ చేసుకోని రైతులను గుర్తించి వారితో కేవైసీ చేయిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో వివిధ కారణాల కారణంగా కేవైసీ చేయించడం సాధ్యమవడం లేదు. సంబంధిత రైతు స్థానికంగా నివాసం ఉండకపోవడం, విదేశాల్లో ఉండడం, మరణించడం లాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. అలాగే స్థానికంగా ఉంటున్న రైతుల ఫోన్ నంబర్లు అనుసంధానం కాకపోవడంతో కూడా కేవైసీ చేయడానికి అవకాశం లేకుండా పోతుంది. ఇలాంటి సమస్యలు గతేడాది నుంచి పరిష్కారం కావడం లేదు. ఇందులో విడ్డూరం ఏమిటంటే రైతులకు వ్యవసాయాధికారులు ఫోన్‌చేసి రమ్మని పిలిచినా వారు రావడం లేదు. తద్వారా జిల్లాలో కేవైసీ పెండింగ్‌లో ఉన్నవారి సంఖ్య తగ్గడం లేదు.

కేవైసీ తప్పనిసరి..

పీఎం కిసాన్ పంట పెట్టుబడి సాయం కోసం రైతులందరూ కేవైసీని పూర్తి చేసుకోవాలి. జిల్లాలో దాదాపు ఇంకా ఐదువేలకు పైగా రైతులు కేవైసీ చేసుకోవాలి. ఈ రైతులందరూ వ్యవసాయ అధికారులకు సహకరించి వెంటనే పూర్తి చేసుకోవాలి. లేదంటే ఈ ఏడాది 16వ విడత డబ్బులు అందవు.


– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

ఏడాది నుంచి అందని సాయం

కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి వరకు పట్టా పాసుపుస్తకాలు ఉన్న రైతులకే పీఎం కిసాన్ పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఇప్పటి వరకు 15 విడతలు అందించగా, ప్రస్తుతం 16వ విడతకు కసరత్తు చేస్తోంది. జిల్లాలో 1.36 లక్షల మంది రైతులు 'పీఎం కిసాన్' సాయాన్ని పొందుతున్నారు. ఒక రైతుకు రూ. రెండు వేల చొప్పున ఏడాదికి మూడు విడతలుగా పెట్టుబడి డబ్బులు అందిస్తోంది. ఈ డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా పడుతున్నాయి. అయితే, జిల్లాలో ఇప్పటి వరకు 96.5 శాతం మంది రైతులు కేవైసీ పూర్తి చేసుకుని సాయాన్ని పొందుతున్నారు. ఇంకా 5,800 మంది రైతులకు కేవైసీ లేకపోవడంతో ఏడాది నుంచి సాయం అందడం లేదు. కేవైసీ పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కేవైసీ లేని రైతుల జాబితా పేర్లు, ఫోన్ నంబర్లతో సహా మండలాలు, గ్రామాల వారీగా ఏఈవోల చేతిలో ఉన్నాయి. ఈ నెల 25వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో ఈ పనిలో నిమగ్నమయ్యారు. రైతులకు ఫోన్లు చేసి పిలిపించుకుంటున్నారు. వేరే ప్రాంతాలు, దేశాల్లో ఉంటున్న వారికి కూడా బంధువుల ద్వారా సమాచారం చేరవేస్తున్నారు. రైతుల ఫోన్లు పనిచేయకపోతే వారి ఇళ్లకు కూడా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫోన్ నంబర్లు లింక్ లేని పక్షంలో స్థానిక మీసేవా కేంద్రాల్లో వేలిముద్రలు నమోదు చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు.

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్: యాసంగి పంటల కోసం మంగళవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఐదో విడత నీటిని విడుదల చేపట్టారు. ప్రధాన కాలువకు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. నీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. మంగళవారం సాయంత్రానికి 1,398.60 అడుగుల(9.915 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.



ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న సాగర్ జలాలు

క్లుప్తంగా

బోటనీ విద్యార్థి శ్వేతకు డాక్టరేట్‌



తెయూ(డిచ్‌పల్లి): తెయూ వృక్షశాస్త్ర విభాగం (బోటనీ)లో పరిశోధక విద్యార్థిని సుంకరి శ్వేత డాక్టరేట్‌ సాధించారు. బోటనీ హెచ్‌వోడీ ప్రొఫెసర్‌ అరుణ పర్యవేక్షణలో 'ఇకలాజికల్‌ స్టడీస్‌ ఆఫ్‌ టూ లేక్స్‌ ఆఫ్‌ నిజామాబాద్‌ డిస్ట్రిక్ట్‌ ఇన్‌ తెలంగాణ విత్‌ రిఫరెన్స్‌ టు డైవర్సిటీ ఆఫ్‌ ప్లాంక్టానిక్‌ అండ్‌ మ్యాట్‌ ఫార్మింగ్‌ ఆల్గల్‌ కమ్యూనిటీస్‌' అనే అంశంపై శ్వేత పరిశోధన గ్రంథాన్ని మంగళవారం సమర్పించారు. కార్యక్రమంలో కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినర్‌ అరుణ, బీవోఎస్‌ చైర్మన్‌ ప్రొఫెసర్‌ విద్యావర్ధిని, అధ్యాపకులు ఎంఏ అలీమ్‌ఖాన్‌, దేవరాజు శ్రీనివాస్‌, వి.జలంధర్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

డైరెక్టర్‌గా కొండెల సాయిరెడ్డి



నిజామాబాద్‌ రూరల్‌: ఆలిండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ అగ్రికల్చరల్‌ అండ్‌ రీసర్చ్‌లోని నూనె గింజల పరిశోధన స్థానం డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన సాయిరెడ్డి మంగళవారం నియామకమయ్యారు. కేంద్ర వ్యవసాయ శాఖ, ఫార్మర్స్‌ వెల్ఫేర్‌ కమిటీ ఆదేశాల మేరకు రూరల్‌ మండలంలోని మారుతీనగర్‌కు చెందిన సాయిరెడ్డి నియామకమయ్యారు. ప్రస్తుతం ఆయన సారంగపూర్‌ షుగర్‌ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ అధ్యక్షునిగా సేవలందిస్తున్నారు. పలువురు సాయిరెడ్డిని అభినందించారు.

జిల్లాస్థాయి సైన్స్‌ ప్రతిభ పోటీలు



నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని కోటగల్లీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్‌ సైన్స్‌, బయోలాజికల్‌ సైన్స్‌ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్‌ టాలెంట్‌ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి నగరపాలక సంస్థ కమిషనర్‌ మంద మకరంద్‌ హాజరై మాట్లాడారు. విద్యార్థులు విషయ పరిజ్ఞానం పొందాలని సూచించారు. ఇంటర్‌ జిల్లా అధికారి రఘురాజ్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఆ దిశగా పయనించాలన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్‌ సైన్స్‌ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు జి శివప్రసాద్‌, పసుపుల రఘునాథ్‌, బయోలాజికల్‌ సైన్స్‌ ఫోరం అధ్యక్ష కార్యదర్శులు, శేఖర్‌, గోవర్ధన్‌, జిల్లా సైన్స్‌ నిర్వాహకుడు గంగాకిషన్‌, స్థానిక హెచ్‌ఎం వాసుదేవరావు, సాంకేతిక నిపుణులు లక్ష్మీనాథం, రాజా అనిల్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగుభాష తియ్యదనం..

- స్వచ్ఛదనానికి ప్రతీక మన భాష
- నేడు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



సన్మానం పొందిన తెలుగు ఉపాధ్యాయులు (ఫైల్‌)

నిజామాబాద్‌ సిటీ: స్వచ్ఛదానానికి ప్రతీకై నది.. అమ్మ ప్రేమలా తియ్యనైనది తెలుగు భాష. ప్రేమైనా.. బాధైనా.. కోపమైనా.. భావం ఏదైనా మనసార పలకాలన్నా.. చెవులారా వినాలన్నా అమ్మ భాషతోనే సాధ్యం. మన భాషను. యాసను కాపాడుకోవడం.. భావితరాలకు అందించడం మనందరి బాధ్యత. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ప్రతి ఏటా ఫిబ్రవరి 21న నిర్వహించాలని 1999 ఫిబ్రవరి 21న యునెస్కో ప్రకటించింది. దీంతో 2000 ఫిబ్రవరి21 నుంచి ప్రపంచ వ్యాప్తంగా అన్ని భాషల సంరక్షణ కోసం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా జరుపుకొంటున్నాం.

తెలుగు భాషను కాపాడేందుకు జిల్లా తెలుగు ఉపాధ్యాయులు తమవంతు రచనలు చేస్తూ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. రూరల్‌ మండలంలోని గుండారం ప్రభుత్వ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి డాక్టర్‌ కాసర్ల నరేశ్‌ రావు 20 ఏళ్లగా పిల్లల కోసం పద్యాలు, గేయాలు, పాటలు, కథలు, నాటికలు, బుర్రకథలు, ఏకపాత్రాభినయాలు రచించి పిల్లలో తెలుగుభాష అభిమానాన్ని పెంచిపోషిస్తున్నారు. తాను రచించిన వాటిలో గేయాలను లలిత తరంగాలు అనే పస్తుకం, నాటికలను జై విజ్ఞాన్‌ అనే పుస్తకంగా తీసుకొచ్చారు. విద్యార్థుల్లో మాతృభాష తెలుగుపై మమకారం పెంచే విధంగా నిరంతరం శ్రమిస్తూ, వారిచే కవితలు, పద్యాలు, కథలు రాయిస్తున్నారు. బాలలేఖిని, గుండారం గువ్వలు అనే పుస్తకాలను విద్యార్థుల రచనలతో తీసుకొచ్చారు. పిల్లలను ప్రోత్సహిస్తూ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొనేటట్లు మార్గదర్శనం చేస్తూ, బాలబంధువుగా నిలుస్తున్నారు.

తెలుగు భాషామల్లెలు గుండారం బడిపిల్లలు..

గుండారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదివేది ఆంగ్లమాధ్యమమైనా, మాతృభాష తెలుగు మీద మమకారాన్ని పెంచుకొని కవితలు, కథలు, పాటలు రాస్తున్నారు. ఈ పాఠశాల విద్యార్థులు ఇటీవల కెనడా దేశం కేంద్రంగా వివిధ దేశాలలో ప్రాంతాలలో ఉన్న బాలల కోసం వెలువడుతున్న 'అంతర్జాతీయ బాలల మాసపత్రిక–గడుగ్గాయి'లో నిర్వహించిన సంక్రాంతి కవితల పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థాయిలో బహుమతులు సాధించారు. 9వ తరగతికి చెందిన ఒ.శ్రుతిరెడ్డి, ఆర్‌ లాస్య, ఎ కృష్ణవేణి, ఈ ఐశ్వర్య, బి సింధూజ, బి నిహారిక, 7వ తరగతికి చెందిన ఎస్‌ వైష్ణవిలకు వీరి మార్గదర్శక గురువులు డాక్టర్‌ కాసర్ల నరేశ్‌ రావు, డాక్టర్‌ వారె దస్తగిరి, ప్రధానోపాధ్యాయుడు బి అమర్‌నాథ్‌తో పాటు, ఉపాధ్యాయులు వీరికి సహకరిస్తున్నారు.

సహజంగా అలవడేదే మాతృభాష



బాల్యంలో తల్లి ఒడిని తొలి బడిగా చేసుకుని నేర్చుకుంటాం. ఈ నేర్పు సాంస్కృతిక భాషా వైవిధ్యానికి పునాదిలాంటిది. తెలుగులో అద్భుతమైన విజ్ఞాన భాండాగారం ఉంది. ఈ విషయం చాలామందికి తెలియక, తెలుగు తమ మాతృభాష అయినప్పటికీ చులకనగా భావిస్తారు. అందుకే భాషా కోవిధులు కృషిచేసి ముందు తరాలవారికి ఈ విజ్ఞాన భాండాగారాన్ని తెలియజేయాలి. అందరికీ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలు.

– చింతల శ్రీనివాస్‌, తెలుగు ఉపాధ్యాయుడు

తెలుగు సాహిత్యంలో రాణిస్తున్న 'తడపాకల్‌' విద్యార్థులు



తడపాకల్‌ విద్యార్థులు రచించిన కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ (ఫైల్‌)

మోర్తాడ్‌: 'చివురు బాలరచన చిగురెత్త మీనోట.. తెలుగు భాష కిదియ దివ్యశక్తి.. తాటి పాకలిపుడు తల్లి గౌతమితోడ.. తెలుగు వెలుగు నలదిశ తేజరిల్లు' అని ప్రముఖ కవి బెజుగామ రామమూర్తి ఏర్గట్ల మండలం తడపాకల్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ప్రశంసించారు. ఆ కవి రాసిన కవిత భావనకు అద్దం పట్టేలా తడపాకల్‌ విద్యార్థులు మాతృభాష సేవలో తరిస్తున్నారు. 2013 నుంచి మొదలైన తడపాకల్‌ విద్యార్థుల సాహితీ ప్రయాణం నిరాటంకంగా సాగుతూనే ఉంది. పుస్తకాలతో కుస్తీ పడుతూనే మరో పక్క తమ మెదడుకు పదును పెడుతూ కవితలు, కథలు రాస్తూ సాహిత్య లోకంలో విహరిస్తున్నారు. విమర్శకులను మెప్పించి వారి మన్నలను పొందుతూ తెలుగు సాహిత్యానికి జీవం పోస్తున్న తడపాకల్‌ విద్యార్థులు ఇప్పటి వరకు శతకాలు, కవితలు, కథల పుస్తకాలను 15వరకు రాశారు. తమ తెలుగు ఉపాధ్యాయుడు ప్రవీణ్‌ శర్మ అందించిన ప్రోత్సాహంతో ఇక్కడి విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ప్రతిభ చాటి అందరి ప్రశంసలను అందుకుంటున్నారు. ప్రముఖ కవులు డాక్టర్‌ సి నారాయణ రెడ్డి, ఆచార్య ఎల్లూరి శివారెడ్డిలతో పాటు ఐఏఎస్‌ అధికారులైన బుర్రా వెంకటేశం, యోగితారాణా, నారాయణరెడ్డి, రాజీవ్‌ గాంధీ హనుమంతు, అక్షర యాణ్‌ ఉమెన్‌ రైటర్స్‌ ఫోరం లాంటి ఎన్నో సాహిత్య సంస్థల ప్రతినిధులతో తడపాకల్‌ విద్యార్థులు సత్కారాలు పొందారు.

తడపాకల్‌ విద్యార్థులు రాసిన పుస్తకాలు

- 2013లో బాల కవితా తరంగాలు(వచనా కవితా సంపుటి)
- 2014లో చిగురు బాల శతకం(చందోబద్దంగా రాసిన శతక పుస్తకం) జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్‌ సీ నారాయణ రెడ్డి ఆవిష్కరించారు.
- 2016లో చిగురు కొమ్మ(వచనా కవితల పుస్తకం)
- 2017లో చెట్టు పద్య శతకం(ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా హరిత హారం ప్రాముఖ్యతను తెలుపుతూ 15 మంది విద్యార్థులు రాసిన పుస్తకం)
- 2019లో కవినాయ వినాయక(కవితా సంపుటి), సద్మీన్‌ రాసిన ముద్దబంతి, మరో విద్యార్థిని సౌమ్య రాసిన బంగారు బాల్యం పుస్తకాల ఆవిష్కరణ జరిగింది.
- తాజాగా వైష్ణవి రాసిన చదువు(సరళ వచనా శతకం), స్వాతంత్ర ఫలాలు(సరళ వచనా శతకం) పుస్తకాలు ఆవిష్కరించబడ్డాయి. మరో మూడు పుస్తకాలు ముద్రణ దశలో ఉన్నాయి.

చైర్‌పర్సన్‌ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమయ్యేనా..?

- 15 రోజుల్లో ఎన్నిక నిర్వహించాలన్న హైకోర్టు
- రాష్ట్ర ప్రభుత్వ లేఖను ఉపసహరించుకుంటూ జిల్లా కలెక్టర్‌కు చేరిన ప్రిన్సిపల్‌ సెక్రటరీ లేఖ

ఆర్మూర్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పండిత్‌ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు హైకోర్టు పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన ఆదేశాల మేరకు కొత్త చైర్‌పర్సన్‌ ఎన్నిక ప్రక్రియ ప్రారంభం అవుతుందా అనే అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్ర ప్రభు త్వ ప్రిన్సిపల్‌ సెక్రటరీ దాన కిశోర్‌ అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఇచ్చిన ఉత్తర్వులపై బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లు హైకోర్టు ను ఆశ్రయించగా న్యాయమూర్తి సోమవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. జనవరి 3న ప్రిన్సిపల్‌ సెక్రటరీ దాన కిశోర్‌ జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొంటూ కోర్టుకు నివేదించారు. హైకోర్టు సూచించినట్లుగానే త్వరలో ఎన్నిక నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నివేదిక కాపీని జిల్లా కలెక్టర్‌ రాజీవ్‌గాంధి హనుమంతుకు పంపినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధా రంగా చైర్‌పర్సన్‌ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది కావున చైర్‌పర్సన్‌ పీఠం ఖాళీ అయిందంటూ కలెక్టర్‌ ప్రి న్సిపల్‌ సెక్రటరీకి తిరిగి లేఖ రాయాల్సి ఉంటుంది.

ఆర్మూర్‌ మున్సిపాలిటీలో రెండు నెలలుగా చోటు చేసుకుంటున్న గందరగోళ పరిస్థితులతో కొత్త చైర్‌పర్సన్‌ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందా లేదా మళ్లీ ఏమైనా అడ్డంకులు ఎదురవుతాయా అనే చర్చ ప్రధానంగా జరుగుతోంది.

కలెక్టర్‌ను కలవనున్న బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లు

హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలు, ప్రిన్సిపల్‌ సెక్రటరీ ఉత్తర్వులను ఉపసంహరించుకోవడం తదితర పరిణామాల అనంతరం తదుపరి చర్యలకు బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లు బుధవారం కలెక్టర్‌ను కలిసి నివేదించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరో వైపు నోటిఫికేషన్‌ వెలువడగానే బీఆర్‌ఎస్‌కి చెందిన ఆశావహులు చైర్‌పర్సన్‌ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సూచన మేరకు కౌన్సిలర్లను క్యాంపులకు తరలించే ఏర్పాట్లను ప్రారంభించారు.

దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఆదరణ కరువు..

- ఎంపీ ధర్మపురి అర్వింద్‌
- నిజామాబాద్‌ను పసుపు ఎక్స్‌పోర్ట్‌ హబ్‌గా చేస్తామని హామీ



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్‌

సుభాష్‌నగర్‌: దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ఆదరణ కరువైందని నిజామాబాద్‌ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఐదేళ్లలో పసుపు సాగు విపరీతంగా పెరిగిందని, తెలంగాణలో మాత్రం కూలీ రేట్లు అధికంగా ఉండడంతో సాగు విస్తీర్ణం తగ్గిందని అన్నారు. ఈవిషయాన్ని అవగాహన లేని, పూటకో పార్టీ మార్చే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు గ్రహించాలని అన్నారు. అంతర్జాతీయంగా పసుపు డిమాండ్‌ను బట్టి ధర ఉంటుందని, సాగు విస్తీర్ణం తగ్గితే ధర పెరగదని, తుమ్మలకు పసుపు సాగు, రైతుల కష్టాలు, ధరపై ఏ మాత్రం అవగాహన లేదని విమర్శించారు. బీజేపీకి పెరుగుతున్న ఆదరణ జీర్ణించుకోలేక కాంగ్రెస్‌ నాయకులు పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పసుపు సాగు విస్తీర్ణం, ధర పెంచే బాధ్యత ప్రధాని మోదీ, తాను తీసుకున్నామని, ఆ కమిట్‌మెంట్‌తోనే ఉన్నామని, నిజామాబాద్‌ను పసుపు ఎక్స్‌పోర్ట్‌ హబ్‌గా మారుస్తామని పేర్కొన్నారు.

24న 'ధర్మ బీజం' విజయవంతం చేయాలి..

నగరంలోని పాత కలెక్టరేట్‌ మైదానంలో ఈనెల 24న ధర్మపురి అర్వింద్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్మ బీజం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ కోరారు. ప్రముఖ ప్రవచనకారులు గరికపాటి నర్సింహారావు, ప్రముఖ ఆధ్యాత్మిక గాయకులు కన్హయ్య మిట్టల్‌ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి,గద్దె భూమన్న, పద్మారెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పంచరెడ్డి ప్రవళిక, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

నగరంలోని ఖిల్లా ప్రాంతంలో నిర్మించిన నూతన కేంద్రీయ విద్యాలయ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీ అర్వింద్‌ హాజరై మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉత్సాహంగా ఉపన్యాస పోటీలు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో 13 జిల్లాలకు చెందిన యువతకు అధికారులు మంగళవారం వీడియో ద్వారా ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయి యువజన పార్లమెంట్‌ ఉపన్యాస పోటీల్లో భాగంగా 'దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్ర'పై పోటీలు నిర్వహించినట్లు పోటీల నిర్వాహకురాలు, జిల్లా యువజన అధికారిణి శైలిబెల్లాల్‌ తెలిపారు. పోటీల్లో ప్రతి జిల్లా నుంచి ప్రథమ, ద్వితీయ విజేతలను రాష్ట్రస్థాయికి పంపనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని అందులో గెలిచే విజేతలకు రూ.2 లక్షల నగదు బహుమతి ఉంటుందన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శ్రీమన్నారాయణ చారి, కళాగోపాల్‌, కేశవ్‌ కుమార్‌, వినయ్‌ కుమార్‌ వ్యవహరించారు.

ఆయకట్టును కాపాడుకోవాలి

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌ రెడ్డి



ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కమ్మర్‌పల్లి: ఎస్సారెస్పీ నుంచి మిడ్‌ మానేరు డ్యాం వరకు ఉన్న ఆయకట్టును కాపాడుకోవాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్తూ మార్గమధ్యలో కమ్మర్‌పల్లి శివారులో వరద కాలువ వద్ద ఎమ్మెల్యే ఆగారు. వరద కాలువ ద్వారా దిగువకు నీరు వెళ్తుండటం గమనించి అక్కడి నుంచే ఎస్సారెస్పీ ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్సారెస్పీలో ఉన్న నీటిని వరద కాలువ ద్వారా దిగువకు కేటాయింపు కన్న ఎక్కువ వెళ్లకుండా చూడాలని కోరారు. ప్రాజెక్టులో నీటి నిల్వ ఎంత మేరకు ఉంది, ఈ సీజన్‌లో పంటలకు ఎన్ని టీఎంసీలు అవసరం అవుతాయని అడిగి తెలుసుకున్నారు.

తప్పుదోవ పట్టించొద్దు..

వరద కాలువ ద్వారా దిగువ భాగానికి నీరు వెళ్లడం లేదని తనను, రైతులను తప్పుదోవ పట్టించొద్దని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఎస్సారెస్పీ ఎస్‌ఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగపూర్‌ శివారులోని వరద కాలువ హెడ్‌ రెగ్యులేటరీ వద్దకు వెళ్లారు. హెడ్‌ రెగ్యులేటరీ 4 షెటర్లలో ఒక షెటర్‌ నుంచి పూర్తిగా మరో షెటర్‌ నుంచి పాక్షికంగా నీరు కిందికి వెళ్తుందని రైతులు ప్రశాంత్‌రెడ్డికి వివరించారు. దీంతో ప్రశాంత్‌రెడ్డి ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడుతూ.. వరద కాలువ ద్వారా నీరు వెళ్లడం లేదని తప్పుదోవ పట్టించొద్దని మండిపడ్డారు. వరద కాలువలోని షెట్టర్లను మూసివేయించాలని సూచించారు.

అయోధ్య రామయ్య సేవలో..



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: అయోధ్యలో బాలరాముడి దర్శనానికి వెళుతున్న తెలంగాణ భక్తులకు సేవలు అందించేందుకు విశ్వహిందూ పరిషత్‌ ఇందూరు జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్‌ వెళ్లారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అయోధ్యకు వెళ్లిన భక్తులకు వివిధరకాల సేవలు కల్పించేందుకు గాను వీహెచ్‌పీ తెలంగాణ నుంచి 11 మంది ప్రబంధక్‌లుగా నియమించింది. ఈ సందర్భంగా దయానంద్‌ మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి వచ్చే కార్యకర్తలకు వసతి, భోజన సౌకర్యం, రవాణా సౌకర్యం విషయమై బాధ్యతలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణనుంచి 2,400 మంది కార్యకర్తలకు అన్ని సదుపాయాలు సమకూర్చి ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్రీరామచంద్రుని దర్శనం చేయించేందుకు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయోధ్య రామయ్యకు, కార్యకర్తలకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన విశ్వహిందూ పరిషత్‌ తెలంగాణ ప్రాంత పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

క్రైం కార్నర్‌

ఇద్దరిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: ఓ వివాహితను చంపుతామని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బీసీ కాలనీలో నివాస ఉండే అమీనాబేగానికి అదే కాలనీకి చెందిన కటికె షన్ను, అయూబ్‌లు ఈ నెల 16న రూ. వెయ్యి అప్పుగా ఇవ్వాలని కోరారు. ఆమె ఇవ్వకపోవడంతో వారు కక్ష పెంచుకుని వివాహితను చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి అదృశ్యం



కామారెడ్డి క్రైం: పట్టణంలోని ఎన్‌జీఓఎస్‌ కాలనీలో నివాసం ఉండే కేసిరెడ్డి నర్సింహారెడ్డి అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లిన నర్సింహారెడ్డి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

కల్దుర్కిలో ఒకరు..

బోధన్‌ టౌన్‌: మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన సిరిగిరి బుజ్జిబాబు అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వీరయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లిన బుజ్జిబాబు తిరిగి రాలేదన్నారు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు గ్రామాల్లో 144 సెక్షన్‌

వేల్పూరు: జానకంపేట, పచ్చలనడ్కుడ గ్రామాల్లో గురువారం వరకు 144 సెక్షన్‌ అమలులో ఉంటుందని తహసీల్దార్‌ సరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు గ్రామాల మధ్య వాగులో సరిహద్దు సర్వే నిర్వహిస్తున్నందున గ్రామాల్లో 144 సెక్షన్‌ విధించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా 144 సెక్షన్‌ను ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నకిలీ జర్నలిస్టు బైండోవర్‌

బిచ్కుంద(జుక్కల్‌): మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టునని చెలామణి అవుతున్న ఓ నకిలీ జర్నలిస్టును తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. ఓ కుటుంబ తగదాలలో తలదూర్చి ఎలాంటి కేసులు లేకుండా ఒప్పందం చేయిస్తానని బాధితుడి నుంచి డబ్బును డిమాండ్‌ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు తెలిపారు.

బస్సును ఓవర్‌టేక్‌ చేయబోయి యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



సుమన్‌ (ఫైల్‌)

బాన్సువాడ: ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్‌ చేయబోయి ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన బాన్సువాడలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలం టిక్యానాయక్‌ తండాకు చెందిన సుమన్‌(16), పిట్లంకు చెందిన ముస్తాఫా స్నేహితులు. వీరు బాన్సువాడ బస్టాండ్‌ నుంచి బైక్‌పై పిట్లంకు వెళ్తుండగా పట్టణంలోని రాజీవ్‌చౌరస్తాలో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్‌ చేయబోయి బస్సు టైర్ల కింద పడ్డారు. ఈ ఘటనలో సుమన్‌ అక్కడికక్కడే మృతి చెందగా, ముస్తాఫాకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ ముస్తాఫను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

సౌదీలో సదాశివనగర్‌ వాసి..

సదాశివనగర్‌: మండల కేంద్రానికి చెందిన పోలబోయిన నారాయణ(66) సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందాడు. బతుకుదెరువు కోసం నారాయణ సౌదీకి ఆరేళ్ల క్రితం వెళ్లాడు. అక్కడ పని చేస్తున్న ప్రదేశంలో 20 రోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందినట్లు అక్కడి పోలీస్‌స్టేషన్‌ను నుంచి సమాచారం అందినట్లు కుటుంబీకులు తెలిపారు. తన తండ్రి మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని మృతుడి కుమారుడు శ్రీనివాస్‌, కుటుంబీకులు ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహానాయుడిని కలిసి విన్నవించారు.

దుబాయ్‌లో గన్నారం యువకుడు..



విజయ్‌ (ఫైల్‌)

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన కాశెట్టి విజయ్‌(27) దుబాయ్‌లో గుండెపోటుతో ఆదివారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. మృతుడి తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ బాధ్యతల నిమిత్తం నాలుగేళ్లుగా విజయ్‌ దుబాయిలో ఉంటున్నాడు. తాను పనిచేస్తున్న కంపెనీకి ఉదయం వెళ్లే సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య



జలంధర్‌ (ఫైల్‌)

మోపాల్‌: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిన్నాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై గంగాధర్‌ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన అక్కం జలంధర్‌ (46) వీఆర్‌ఏగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చూయించినా నయం కావడం లేదు. దీంతో జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య కళావతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత..

సిరికొండ: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాడెండ్ల లక్ష్మి(45)కి తరచూ కుటుంబ సభ్యులతో గొడవలు జరుగుతున్నాయి. లక్ష్మి భర్త రాజన్న గల్ఫ్‌ దేశం ఖతార్‌లో ఉంటున్నాడు. ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ జరుగగా మనస్తాపానికి గురైన లక్ష్మి సోమవారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న శ్రీనివాస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బైక్‌ అదుపుతప్పి యువకుడికి గాయాలు

నందిపేట్‌: బైక్‌ అదుపుతప్పి కిందనపడిన ఘటనలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన హైమద్‌ ఎమ్మార్వో కార్యాలయం నుంచి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు బోల్తా ఒకరికి గాయాలు

రామారెడ్డి: మండల శివారులోని పటేల్‌ చెరువు సమీపంలో మంగళవారం రాత్రి కారు బోల్తా పడిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పోసానిపేట నుంచి ఇసన్నపల్లికి కారులో వస్తున్న గ్రామానికి చెందిన పెద్ద లింబాద్రి ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. ఈ ఘటనలో లింబాద్రికి గాయాలయ్యాయి.

అక్రమంగా ఇసుక రవాణా చేపడితే చర్యలు తప్పవు

బోధన్‌రూరల్‌: సాలూర, బోధన్‌ మండలాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ అన్నారు. బోధన్‌, సాలూర మండలాల్లో మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్‌ చేసి కేసులు నమోదు చేశారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మెద శివారులో పేకాటస్థావరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. గ్రామశివారులోని పటేల్‌చెరువు వద్ద పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకొని వారి నుంచి రూ.8,230నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. వీరిపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.